క్లుప్తంగా

చేప మందు పంపిణీ



ప్రజలకు చేప మందు వేస్తున్న నిర్వాహకుడు

ఆదోని అర్బన్: మృగశిరకార్తి సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఫరషాముల్లా కాలనీలో ఆదివారం చేపమందు పంపిణీ చేశారు. బళ్లారి నుంచి వచ్చిన నిర్వాహకుడు ప్రజలకు నోట్లో చేప మందు వేసి మంచినీటిని తాగించాడు. ఈ చేప మందు దగ్గు, ఆయాసం, ఉబ్బసం వ్యాధులకు ఈ మందుతో నయమవుతుందని స్వీకరించారు.

పరామర్శ



రంగన్న ఆరోగ్య విషయాలను తెలుసుకుంటున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో గత కొన్ని రోజులు అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రంగన్నను ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య విషయాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం బాగా చూసుకోవాలని, వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఆయనతో పాటు గ్రామ నాయకులు తిప్పన్న, వీరేంద్ర, బిసుపల్లి, పెద్దయ్య తదితరులు ఉన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ తగదు



మాట్లాడుతున్న కార్మిక సంఘ నాయకుడు

ఎమ్మిగనూరుటౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించడం తగదని ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ నాయకులు ప్రసాద్, తిమ్మగురుడు అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 2500 కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకొని ప్రైవేటీకరణ చేయడం మానుకోవాలన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు, ప్రజలు ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు వీరేష్, దాదావలి, రంగస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కురువ సంఘం తాత్కాలిక అధ్యక్షుడి ఎన్నిక



జిల్లా కురువ సంఘం తాత్కాలిక అధ్యక్షుడు మల్లికార్జునతో రాష్ట్ర నాయకులు

ఆదోని అర్బన్: పట్టణంలోని జిల్లా కురువ సంఘం తాత్కాలిక అధ్యక్షుడిగా మల్లికార్జునను రాష్ట్ర నాయకులు ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక భీరప్ప ఆలయ కల్యాణ మండపంలో రాష్ట్ర కురువ సంఘం నాయకులు రామచంద్ర, రామ్‌కుమార్, నారాయణ ఆధ్వర్యంలో ఆయనను ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల దేవేంద్రప్ప పదవికి రాజీనామా చేశారని, దీంతో ఆ పదవికి తాత్కాలికంగా ఎన్నుకున్నట్లు తెలియజేశారు. పూర్తిస్థాయిలో ఆ పదవికి మరో సమావేశంలో ఎన్నుకుంటామన్నారు.

ఈఏపీ సెట్ ఫలితాల్లో ప్రతిభ



ఎస్.వెంకటసాయి వరుణ్‌తేజ్‌రెడ్డి



ఉప్పర హేమచంద్ర

ఆదోని సెంట్రల్: ఈఏపీసెట్ ఫలితాల్లో పట్టణానికి విద్యార్థులు ప్రతిభను చాటారు. పట్టణానికి చెందిన డా.ఎస్.రాజశేఖర్ రెడ్డి, డా.పద్మజ కుమారుడు ఎస్.వెంకటసాయి వరుణ్‌తేజ్ రెడ్డి 245 ర్యాంకును సాధించాడు. తల్లిదండ్రులు ఇద్దరూ పంటి డాక్టర్లుగా పని చేస్తున్నారు.

ఇటీవల విడుదలైన జెఈఈ అడ్వాన్స్‌లో కూడా 826 ర్యాంకును సాధించి తన ప్రతిభను చాటినట్లు తల్లిదండ్రులు తెలిపారు. అదేవిధంగా పట్టణానికి చెందిన ఉప్పర వెంకటేశులు, జి.శివనాగమ్మ కుమారుడు ఉప్పర హేమచంద్ర ఈఏపీసెట్ ఫలితాల్లో 497వ ర్యాంకును సాధించాడు. తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులు. ఇతను ఇటీవల విడుదలైన జెఈఈ అడ్వాన్స్‌లో 467వ ర్యాంకును సాధించాడు.

కొరవడిన కనీస వసతులు

- ఇష్టానుసారంగా పెట్రోల్ బంకుల నిర్వహణ
- కనిపించని మరుగుదొడ్లు, తాగునీటి వసతి
- షెడ్డు లేని బంకులెన్నో
- కొన్ని బంకుల్లో పెట్రోలు పోయడంలో చేతివాటం
- జిల్లా అధికారులు ఆదేశాలిస్తేనే తనిఖీలు చేస్తున్న అధికారులు



ఆదోనిలోని వసతులు లేని ఓ పెట్రోల్ బంకు

ఆదోని అర్బన్: ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటాయి. వీటి ధరలు పెరిగినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులపై ప్రజల్లో చర్చ సాగుతూ ఉంటుంది. సాధారణంగా మనం పెట్రోల్ బంకుల్లోకి వెళ్లి వాహనానికి పెట్రోల్ కొట్టించుకుని వెళ్లిపోతుంటాం. అయితే అక్కడ మరిన్ని సేవలు పొందే అవకాశం ఉంది. అవి కూడా ఉచితమే. కానీ అలాంటివేవీ కనిపించడంలేదు. కొన్ని చోట్ల పెట్రోలు వేయడంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అయినా అధికారులు మాత్రం బంకువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులు ఆదేశిస్తేనే తనిఖీలు జరుగుతాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నియోజకవర్గంలో 18 పెట్రోల్ బంకులు..

ఆదోని నియోజకవర్గంలో 18 పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఈ పెట్రోల్ బంకుల ద్వారా కొన్ని లక్షల వాహనాలకు పెట్రోల్, డీజిల్ వేస్తారు. ఆదోనికి కర్ణాటక బార్డర్ కూడా ఉంది. అంతేగాకుండా మంత్రాలయం, ఉరుకుంద పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ఈ పెట్రోల్ బంకుల ద్వారా ఆదోనితోపాటు కర్ణాటక రాష్ట్రం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిపోయే టూ, త్రీ, ఫోర్ వీలర్లు వాహనాలు, ట్రాన్స్‌పోర్టు వాహనాలు ప్రతిరోజూ అవసరమైన పెట్రోల్, డీజిల్ వాహనాలను వినియోగిస్తున్నారు. లీటర్ పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేస్తే అందులో మనం బంకుకు 4 పైసల నుంచి 8 పైసల వరకు మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణకు సెస్ రూపంలో చెల్లిస్తున్నాం. అయినా కొన్ని పెట్రోల్ బంకుల్లో సేవలు కానరావడం లేదు. సౌకర్యాల గురించి చాలామందికి తెలియదు. కొన్ని చోట్ల పెట్రోలు వేయాల్సిన దానికన్నా తక్కువ వేస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. ఒకరిద్దరు వినియోగదారులు సౌకర్యాలపై ప్రశ్నిస్తే నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

బంకుల వద్ద కల్పించాల్సిన వసతులు

- బంకుల వద్ద స్వచ్ఛమైన తాగునీటి వసతి కల్పించాలి. దీనికోసం బంకు డీలర్ ఆర్వో యంత్రం, వాటర్ కనెక్షన్ స్వయంగా పొందాలి. ఏ బంకులోనైనా తాగునీటి వసతి లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు.
- మూత్ర శాలలు, మరుగుదొడ్లు ఉండాలి
- స్వచ్ఛభారత్‌లో భాగంగా అన్ని బంకుల్లో వాహనదారులు ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని పలుచోట్ల ఏర్పాటు చేసినా వినియోగించేందుకు నిర్వాహకులు అనుమతించడంలేదనే విమర్శలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల అసలు కనిపించని పరిస్థితి.
- బంకుల్లో ఇలాంటి సౌకర్యాలు లేకపోతే పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు.
- వాహనాల టైర్లలో గాలి నింపడానికి గాలిశాతం తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో కచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు కూడా ఓ వ్యక్తిని ఉంచాలి. గత నెలలో జిల్లాధికారులు ఓ పెట్రోల్ బంకులో తనిఖీ చేయగా, గాలి నింపేందుకు వ్యక్తి సెలవులో ఉన్నాడని అధికారులకు చెప్పి పెట్రోల్ బంకు నిర్వాహకులు తప్పించుకున్నారు. షెడ్డు కూడా లేని పెట్రోల్ బంకులు ఆదోని పట్టణంలో ఎన్నో ఉన్నాయి.
- ప్రతి బంకుల్లో ఫిర్యాదు పెట్టె, రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారుడు తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ప్రథమ చికిత్స కిట్టు ప్రతి బంకు వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది.
- అత్యవసర పరిస్థితుల్లో ఫోన్‌ను వినియోగించుకునే సదుపాయం బంకులో ఉండాల్సిందే. వీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యల్లో చిక్కుకుంటే మీ వద్ద మొబైల్ ఫోన్ వద్ద లేకుంటే భయపడాల్సిన పని లేదు. ఏదైనా పెట్రోల్ బంకును సందర్శించడం వల్ల కాల్ చేయవచ్చు.
- పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలను తెలుసుకునే హక్కు వినియోదారులకు ఉంటుంది. పెట్రోల్, డీజిల్ నాణ్యత పరిమాణాన్ని తెలుసుకునేందుకు పరికరాలను సిద్ధంగా ఉంచాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా పరీక్షించుకోవచ్చు.

నిబంధనల ప్రకారం తప్పనిసరి

నిబంధనలకు అనుగుణంగా పెట్రోల్ బంకులను నిర్వహించాలి. కచ్చితంగా మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, వాహనాలకు గాలి నింపాలి. అందుకు ఒకరు వ్యక్తి ఉండాలి. ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. గత నెలలో కూడా జిల్లా అధికారులతో పాటు అన్నిశాఖల్లో తనిఖీలు చేశాం. నిరంతరం తనిఖీలు చేపడుతున్నాం.

– వలిబాషా, సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్

చాపమ్మవ్వ గుడి నిర్మాణానికి భూమిపూజ



చాపమ్మవ్వ గుడి నిర్మాణానికి భూమిపూజ అనంతరం ప్రార్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: మండలంలోని నెట్టేకల్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న మహిమాన్వితురాలు చాపమ్మవ్వ దేవాలయం నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. భక్తుల ఇలవేల్పుగా వెలుగొందిన చాపమ్మవ్వ నెట్టేకల్ రోడ్డులో జీవ సమాధి అయ్యారు. భక్తుల పాలిట ఇలవేల్పుగా వెలుగొందారని, ఆమె ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత భక్తులపైనే ఉందన్నారు. కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రంలో ఎంతో పేరుగాంచిందని సాయిప్రసాద్‌రెడ్డి చెప్పారు. దేవాలయ నిర్మాణానికి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. దాతలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎవరైనా దాతలు చందాలు ఇవ్వాలనుకుంటే ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడికి పరామర్శ



న్యాయవాది గురురాజరావును పరామర్శిస్తున్న బుట్టా శివ నీలకంఠ, వై.ప్రదీప్‌రెడ్డి



పరామర్శిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్/టౌన్ మంత్రాలయం మండల మాలపల్లిలో ఆదివారం తెలుగుదేశం నాయకులు చేసిన దాడిలో గాయపడిన ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల లీగల్ సెల్ అధ్యక్షుడు న్యాయవాది గురురాజరావు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లి పరామర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుట్టా శివ నీలకంఠ, జిల్లా ఉపాధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి వేర్వేరుగా వెళ్లి పరామర్శించారు. న్యాయవాదిపై దాడి చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు పద్ధతులు మార్చుకోకపోతే ప్రజలే రాబోవు రోజుల్లో తగిన బుద్ధిచెపుతారని హెచ్చరించారు. ఇదిలా ఉండా వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.ప్రదీప్ రెడ్డి న్యాయవాది గురుజారావు వెంటే ఉన్నారు. పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుత్వాసుపత్రికి చేరుకొని దాడిలో గాయపడ్డ న్యాయవాదిని పరామర్శించారు.

ఏడాదిలో ఏం అభివృద్ధి చేశారు?



మాట్లాడుతున్న మహిళా విభాగం నాయకురాళ్లు జిలేకాబీ, శ్రీలక్ష్మి

ఆదోని టౌన్: ఏడాదిలో ఏం అభివృద్ధి చేశారో కూటమి ప్రభుత్వం నేతలు ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీలక్ష్మి, మహిళా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జిలేకాబీ డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని విమర్శించే స్థాయి జనసేన పార్టీ నాయకుడు పులిరాజుకు లేదన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో జనసేన నేత పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని చెప్పారని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినా ఒక్క మహిళ ఆచూకీ అయినా లభ్యమయ్యిందా అని ప్రశ్నించారు. పిఠాపురంలో దళితులను గ్రామ బహిష్కరణ చేయగా, డిప్యూటీ సీఎం ఏమి చేస్తున్నారని నిలదీశారు. పసికందులను మొదలుకుని వృద్ధ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా నియంత్రించలేదని కూటమి ప్రభుత్వం కొనసాగుతోందని ఆరోపించారు. ఆదోని నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉర్దూ కళాశాల, బైపాస్ రోడ్డు నిర్మాణం, మెడికల్ కళాశాల వంటి అభివృద్ధి పనులు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ దళిత సంఘం అధ్యక్షుడు వై.పి.గంగాధర్, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి పరిగల నారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గృహాలను వేగంగా పూర్తి చేయాలి

ఆలూరు: లబ్ధిదారులకు మంజూరైన గృహాలను వేగంగా పూర్తి చేయించేందుకు ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, థర్డ్ పార్టీలకు చెందిన వారు చర్యలు తీసుకోవాలని ఆలూరు హౌసింగ్ డీఈ విజయ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం మండలంలో కమ్మరచేడు, మనేకుర్తి, అంగస్కల్, హులేబీడు, ఆలూరు గ్రామంలోని వై జంక్షన్ సమీపంలో నిర్మాణంలోనున్న గృహాలను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక డీఈ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో 95 లేఅవుట్లలో ఇప్పటివరకు 5,550 పక్క గృహాలు మంజూరు కాగా 2,500 వరకు మాత్రమే పూర్తయ్యాయన్నారు. అయితే మిగిలిన గృహాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని వచ్చే నెల ఆఖరు నాటికి గృహప్రవేశాలు చేయించాలని ఆదేశించారు. ఏఈ గంగాభవాని, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.



చిన్నభూంపల్లి గ్రామంలో విరిగిన విద్యుత్ స్తంభం



పెద్ద భూంపల్లి రహదారిలో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లు

గాలీవాన బీభత్సం

కోసిగి : మండలంలో గాలీవాన బీభత్సం సృష్టించింది. ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలవాలాయి. చిన్నభూంపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభం విరిగి కింద పడిపోయే స్థితికి చేరుకుంది. అదేవిధంగా చిన్నభూంపల్లి గ్రామం నుంచి పెద్దభూంపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఆర్టీసీ బస్సులు సైతం నిలిచిపోయాయి. దీంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం రాకతో పలు గ్రామాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

ర్యాలీని జయప్రదం చేయండి

పెద్దకడబూరు: మండల కేంద్రంలో సోమవారం జరిగే యోగాంధ్ర ర్యాలీని జయప్రదం చేయాలని ఎంపీడీఓ జి.ప్రభావతి పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు యోగాపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి బస్టాండ్ ఆవరణ వరకు ఈ ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, పొదుపు మహిళలు, ప్రజలు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఐదో రోజుకు చేరిన దీక్షలు



ఎమ్మిగనూరులో దీక్షకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలోని ఇంజినీరింగ్ సెక్షన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరాహార దీక్షలు ఆదివారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పీరాసాహెబ్, ఉపాధ్యక్షుడు సోమన్న, కోశాధికారి అహ్మద్, నాయకులు కైలాష్, గోవిందు మాట్లాడారు. దీక్షలు చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదని వాపోయారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ మొండి వైఖరిని వీడాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సమస్యల పరిష్కారానికి నిరవధిక దీక్షలో కూర్చొన్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు సీఐటీయూ సంఘీభావం తెలిపింది. కార్యక్రమంలో కార్మిక సంఘ అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ పునరుద్ధరణకు ఉద్యమిద్దాం

దేవనకొండ: జూలై 2న ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అంజి పిలుపునిచ్చారు.ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో బోయ వాల్మీకి సమితి మండల కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వాల్మీకి బోయలకు శ్రీకాకుళం నుంచి ఏలూరు జిల్లా వరకు ఎస్టీ రిజర్వేషన్లు ఉన్నాయని, అయితే విజయవాడ నుంచి రాయలసీమ జిల్లాల వరకు బీసీ–ఏగా పరిగణలోకి తీసుకుంటున్నారన్నారు. 2019 ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాను పునరుద్ధరణ చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ నెరవేరలేదన్నారు. నాయకులు నాగరాజు, రంగన్న, కొలుట్ల, లింగప్ప, మహేందర్‌నాయుడు పాల్గొన్నారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారులు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. పూజారులు స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, పుష్పార్చన, మహామంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. స్వామిని దర్శించుకోవడానికి స్థానికులే కాకుండ పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం చేపట్టారు.

సామాజిక సేవలో బుట్టా ఫౌండేషన్



ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న బుట్టా శివనీలకంఠ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలో డీఎస్సీకి శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు శిక్షణ పూర్తయ్యే వరకు మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని ఆదివారం బుట్టా ఫౌండేషన్ అధినేత, వైఎస్సార్‌సీపీ నాయకుడు బుట్టా శివనీలకంఠ ప్రారంభించారు. డీఎస్సీ అభ్యర్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. అదేవిధంగా పట్టణంలోని యల్లంబీడు ప్రాంతంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు ఆదెప్ప కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహుడు, పేట శ్రీనివాస రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



యోగాసనాలు చేస్తున్న సబ్‌కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, అధికారులు, వృద్ధులు, మహిళలు

యోగాతోనే ఆరోగ్య సిరులు



యోగాసనాలు చేస్తున్న చిన్నారులు

ఆదోని అర్బన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒత్తిడిని తగ్గించేందుకు యోగాతోనే ఆరోగ్యాన్ని సంపాదించవచ్చని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా సీనియర్ సిటీజన్లతో, మహిళలు, పురుషులతో పాటు ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఉప తహసీల్దార్ వలీబాషా యోగాసనాలు చేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజూ ఓ గంటపాటు యోగాసనాలు గానీ, వ్యాయామం గానీ, జాగింగ్ చేసినట్లయితే తమ ఆరోగ్యం పుష్కలంగా ఉంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుందన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇస్కాన్ ప్రవచకులు హిరణ్మయ అచ్యుత దాస్ పేర్కొన్నారు. స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవద్గీత పఠనం, శ్రవణం ఉత్తమ జీవితానికి మార్గం చూపుతాయన్నారు. సమయం సద్వినియోగం చేసుకుంటూ దేవాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలను సందర్శించాలన్నారు. ప్రవచనకర్తల సందేశాన్ని విని ఆచరించాలన్నారు. హరే రామ హరే కృష్ణ జప యజ్ఞం చేయించి హరినామ సంకీర్తనలు ఆలపించారు. అనంతరం జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు రాజభోగ నివేదన చేసి అన్న ప్రసాద వితరణ చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. అలాగే కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో అధికారులు వినతులను స్వీకరిస్తారని ఆయన వెల్లడించారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి

పత్తికొండ : పత్తికొండ రెవెన్యూ డివిజన్, నియోజకవర్గ పరిధిలో మైనింగ్, క్వారీల అక్రమాలపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ క్రాంతినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ డివిజన్ అనేక ఖనిజాలకు ప్రసిద్ధి అని, మైనింగ్, క్వారీల లీజు నిర్వహణలో అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

వరదకాలనీలో సమస్యల తిష్ట



కంప చెట్ల మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



వడ్డే గేరిలో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని వరద కాలనీలో సమస్యలు తిష్ట వేయడంతో అక్కడి నివసించే ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. రోడ్లు, తాగునీటి, విద్యుత్ సమస్యలతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. వరద(కొత్త) కాలనీలో వడ్డే గేరి, చేనేత కార్మికుల కాలనీలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. చిన్నపాటి గాలి వీచినా ఒరిగిన విద్యుత్ స్తంభాలు కూలే ప్రమాదం ఉంది. దీంతో కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. అలాగే కాలనీలో సచివాలయం, ఆర్బీకే నిర్మించిన ప్రదేశం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంప చెట్లు పెరిగాయి. అలాగే కాలనీలోని చేనేత, వడ్డే గేరి ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేక చిన్న పాటి వర్షానికే రోడ్లు చిత్తడిగా మారి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సిబ్బందికి విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఒరిగిన స్తంభాలకు మరమ్మతులు చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న కంప చెట్లను తొలగించాలని, సీసీరోడ్లు నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.